# సుప్రభాతం



కొఠారి వాణీచలపతిరావు

"శ్రీ మాత్రే నమః
శ్రీ మహారాజ్ఞ్యైనమః
శ్రీమత్సింహాసనేశ్వర్యైనమః
చిదగ్నికుండ సంభూతాయైనమః

అని —

ఖంగుమంటున్న 'కౌసల్య' గొంతు మైకు లేకుండానే నాలుగు బజార్లవరకు మారుమ్రోగుతున్నది.

దంతధావనం ముగించి వరండాలో పచార్లు చేస్తున్న ముకుందంగారిలో చికాకు అంతకంతకు పెరిగిపోతున్నది. 'అష్టోత్తరమయిపోయింది. ఇక సహస్రనామాలు మొదలుపెట్టింది. ఇవి ఎప్పుడు ముగుస్తాయో, ఏమో!' అని గొణుక్కున్నారు తనలోతనే.

పాయసం, దద్ధోజనం, పులిహోర, అప్పాలతో దేవుడికి మహానైవేద్యం పెట్టి గంటకొట్టింది కౌసల్య.

ఆ గంట శ్రవణపేయంగా వినిపించింది ముకుందంగార్కి.

'అమ్మయ్య! గంట కొట్టింది! ఇక పూజ అయిపోయినట్లే' అనుకున్నారు. కాఫీకోసం తపించిపోతున్న ప్రాణాలతో తెల్లవారగానే ముందు కాస్త కాఫీ గొంతులో పడితేగానీ ప్రాణం కుదుటపడదు ముకుందం గార్కి.

మడిబట్టతో బయటికి వచ్చిన కౌసల్య పచార్లు చేస్తున్న భర్తవంక చూసి "తెల్లవారిందా అప్పుడే లేచికూర్చున్నారు! కాఫీకోసం అంగలారుస్తున్నారులా ఉంది. అబ్బబ్బ! ఏం మగాళ్ళో ఏమో! రెండు నిముషాలు ప్రశాంతంగా దేవుడి ముందు కూచోనివ్వరుకదా!" అంది విసుగ్గా.

"అమ్మమ్మా! రెండు నిముషాలా? రెండు గంటలయింది నువ్వా దేవుడి గదిలో దూరి. ఇంతసేపటినుండి పచార్లుచేసి..చేసి నా కాళ్ళు కూడా నొప్పి పుడుతున్నాయి" అన్నారు ముకుందంగారు. ఎనిమిది గంటలకు వేడివేడి కాఫీనీళ్ళు గొంతులో పడేసరికి ఎక్కడలేని హుషారులో ఖండువా భుజాన వేసుకుని పొలానికి వెళ్ళారు ముకుందంగారు.

మడిబట్ట మార్చుకుంటూ ఎదురింటి గుమ్మంవైపు చూసి ఆశ్చర్యంగా బుగ్గలు నొక్కుకుంది కౌసల్య.

'అవ్వ! ఎనిమిది గంటలయింది. ఇంకా మహారాణిగార్కి తెల్లవారలేదులా ఉంది. బారెడు పొద్దెక్కినా పాచి వాకిలి అలా ఉంచుకుంటే నట్టింట్లో ఇనుపగజ్జెల తల్లి తిరుగుతుంది అంటారు అందుకే తెల్లవారక ముందే లేచి ఎంచక్కా వాకిట్లో ముగ్గులేసుకుని, గడప పచ్చచేసుకోవటం ఆడవాళ్ళ లక్షణం ఇంత విడ్డూరం ఎక్కడా చూడలేదు!' అని విసవిసలాడింది.

అప్పుడే స్నానం ముగించి అటుగా వచ్చిన కొడుకుని 'అరేయ్ ఇలారా!' అని పిలిచింది కౌసల్య.

"ఇదిగో చూడు! ఎదురింటి 'ఆంటీ' ఇంకా లేచినట్లు లేదు. నువ్వు చప్పున ఆ గోడెక్కి ఇంత కరివేపాకు కోసుకుని రా!" అంది.

ఏదో పెద్ద ఎడ్వంచర్ చేయబోతున్నట్లు .. గబగబా పరుగెత్తి చిటికెలో బుట్టెడు కరివేపాకు కోసుకొచ్చిన కొడుకువంక మెచ్చుకోలుగా చూసింది కౌసల్య.

తెల్లగా తెల్లవారిన తర్వాత వచ్చిన పనిమనిషి 'రంగమ్మ' ను మింగేసేలా చూస్తూ "ఏమే! ఇప్పుడు తెల్లవారిందా నీకు! ఈవేళదాకా పాచివాకిలి ఊడవకుండా నీకోసం అట్టేపెడతాననుకున్నావా?" అంది ఆవేశంతో ఎగిరెగిరిపడుతూ.

చిన్నబోయిన ముఖంతో, ఉబికిన కళ్ళతో దీనంగా నిల్చున్న రంగమ్మ అమ్మగారి కేకలను వినిపించుకునేలా లేదు!

"పిల్లాడికి రాత్రి చాలా జబ్బు చేసిందమ్మగారూ! పట్నం తీసికెళ్ళి పెద్ద డాక్టరుగారికి చూపించాలని అంటున్నారు. ఒక వందరూపాయలుంటే ఇప్పించడమ్మా! మీ కాళ్ళు మొక్కుతాను." అంది.

"ఇక్కడ నేనేమయినా బ్యాంకు తెరుచుకుని కూర్చున్నాననుకున్నావా? వందలు, వేలు నిల్చున్న పళంగా ఇవ్వటానికి" అంది కౌసల్య విసురుగా.


"అలా అంటే ఎలా అమ్మా! ఇప్పుడు నువ్వు తప్ప ఇంకెవరు దిక్కు!" అని కాళ్ళావేళ్ళా పడినమీదట కాస్త మెత్తబడింది కౌసల్య.

"నువ్వు రెక్కల కష్టంమీద బతికేదానివి. ఇవ్వాళ ఈ ఇల్లు, రేపు ఇంకో ఇల్లు! ఏం నమ్మకంమీద ఇమ్మంటావు?" అమ్మగారి అంతర్యాన్ని గ్రహించిన రంగమ్మ చటుక్కున పైట చాటునుండి పుస్తెలతాడు బయటకు తీసింది.

"నా దగ్గర ఈ తాళి బొట్టు తప్ప ఇంకేమీ లేదమ్మా! పోనీ ఇదే తీసుకుని డబ్బులివ్వండి" అని మెడలో నుండి తాళి తీయబోయింది.

'ఆ!ఆ!ఆగు! శుక్రవారం పూట నా ఇంటిముందు అమంగళం పనులు చేయకు! నువ్వెంతకయినా తెగించావుగానీ" అంది కౌసల్య రంగమ్మను వారిస్తూ.

'మాయలపకీరు ప్రాణాలు చిలకలో ఉన్నట్లు, నా పెనిమిటి ప్రాణాలు ఈ తాళిబొట్టులో ఉండవు లేవమ్మా! వాడు కాలిరిగి మంచంలో ఉన్నాడు..కాబట్టి వాడు కట్టిన తాళి ఈవిధంగా సాయపడుతున్నదనుకుంటాను. ఇది తీసినంతమాత్రాన నా పాతివత్యం మంటగలిసిపోదు. ఉన్న నా మొగుడి ఆయుస్సు తరిగిపోదు" అంది





రంగమ్మ.

"అమ్మ ఎంతకు తెగించావే! పొట్టకోస్తే అక్షరంముక్క లేకపోయినా మాటలకు మాత్రం తక్కువలేదు. కాలం ఇలా తగలబడిపోతోంది. నిన్నని ఏం లాభం? అది సరేగానీ... నీ దగ్గర అది తప్ప నిజంగా ఇంకేదీలేదా?"

"ఉన్న కాలిమెట్టెలు ఇదివరకే మీదగ్గర పెట్టాను. ఇంట్లో ఉన్న మట్టిముంతలు..రావెండి బొచ్చెలు తప్ప ఇంక నాదగ్గర ఏమీలేవమ్మా!" అంది రంగమ్మ దీనంగా.

"ఉన్న అప్పే తీరలేదు. మళ్ళీ..ఈ కొత్తది మొదలు పెడుతున్నావు. ఎలా తీరుస్తావే ఏమో! నెలకు వందకు ఐదురూపాయలు వడ్డీ అవుతుంది తెల్సుగా" అని వందరూపాయల కాగితం రంగమ్మ చేతిలో పెట్టింది కౌసల్య.

"కష్టం గట్టెంక్కించారు. మీ పేరు చెప్పుకుని నా కొడుకు ప్రాణాలు రక్షించుకుంటాను. నా మొగుడు కోలుకుని పనిలోకి పోగానే మీ అప్పు వడ్డీతోసహా తీర్చేస్తాను. గొంతు కోసినా నేను అన్నమాట తప్పనమ్మా!" అని వందరూపాయల కాగితాన్ని బొడ్లో దోపుకుంది రంగమ్మ.

వెళ్ళబోతున్న రంగమ్మను వెనక్కు పిలిచి "ఇదిగో! రంగమ్మా మీ పాకమీద గుమ్మడికాయలు కాస్తున్నాయని విన్నాను. వడియాలు పెడదామని!" అని నసిగింది కౌసల్య.

"అలాగే! పంపిస్తానులెండి!"

"ఉట్టిగా వద్దులే! ఓ అర్ధరూపాయి డబ్బులిస్తాను" గడపదాటిపోబోతున్న రంగమ్మ ఒక్కక్షణం ఆగి వెనక్కు తిరిగి "అర్ధరూపాయా?! ఎందుకమ్మా! వట్టిగానే తీసుకోండి!" అంది.

రంగమ్మకు తనమీదున్న భక్తి గౌరవాలకు పొంగిపోయింది కౌసల్య.

ముంగిట్లో జరుగుతున్న ఈ సంభాషణకు ఎదురింటి తలుపులు తెరుచుకున్నాయి.

"లేచింది మహారాణిగారు! తనకు తెలియకపోయినా ఇరుగిల్లు, పొరుగిల్లు చూసయినా నేర్చుకోవాలి. ఏం మనిషో, అయోమయం మనిషి!" అని స్వగతంలా అనుకుంది కౌసల్య.

* * *

"భవతీ భిక్షాందేహి" అంటూ నుదుట విభూతి రేఖలతో, పట్టుపంచెతో వచ్చిన ఇంటి పౌరోహితుడు రామశాస్త్రి చనువుగా లోపలికి వచ్చి చెక్క కుర్చీమీద కూర్చున్నాడు. లోపలినుండి పిడికిలితో బియ్యం తెచ్చి ఆయన జోలిలో వేసింది కౌసల్య.

"అలా పిడికిలితో తేకుంటే దోసిలితో తెస్తే నీ సొమ్మేంపోయిందమ్మా!" అన్నాడు చిరునవ్వుతో శాస్త్రిగారు.

"పొయ్యేది నా సొమ్ము కాకుంటే మీ సొమ్మా! భక్తితో పెట్టే వస్తువు పిడికెడయినా బ్రహ్మాండంతో సమానం. భక్తితో కుచేలుడు తెచ్చిన పిడికెడటుకులు చూసి కృష్ణపరమాత్ముడంతటివాడు పొంగిపోయాడు. కాబట్టి ఈ పిడికెడే ఓ పదివుట్లనుకోండి" అంది కౌసల్య హాస్యంగా.

కౌసల్య ఇంట్లో జరిగే ప్రతి పూజకు, వ్రతానికీ పురోహితుడు శాస్త్రిగారే. కొన్ని సంవత్సరాలుగా ఉన్న పరిచయం వల్ల శాస్త్రిగారితో చనువుగా మాట్లాడుతుంది కౌసల్య.

"శాస్త్రిగారూ! శ్రావణ శుక్రవారం పూజ చేయించటానికి వస్తున్నారు కదా! వరలక్ష్మికి మాఇంట్లో జరిగినంత బ్రహ్మాండంగా ఈ ఊళ్ళో ఎవరింట్లో జరగదని మీకు తెల్సుగా. మీరు దగ్గరుండి శాస్త్రోక్తంగా పూజ చేయించాలి" అంది కౌసల్య.

"అలాగే! దానికేం భాగ్యం!"

"భోజనం కూడా మా ఇంట్లోనే!"

"అది మరుస్తానటమ్మా! నీ చేతి పూర్ణంబూరెలు, పులిహోర తిని చాలా రోజులయింది".

"అయ్యో! అంతకన్నానా! నోములు, వ్రతాలలో బ్రాహ్మడ్ని తృప్తిపరిస్తేనే ఫలితం దక్కేది" తృప్తిగా అంది కౌసల్య.

"నీకీ విషయం తెలుసో, లేదో! మన ఊరికి యోగానంద స్వాములవారని, గొప్ప మహాత్ములు కలిగిన సాధువు వస్తున్నారట ఎల్లుండి. శివాలయంలో దిగుతారట. ఆయన మహిమలను గురించి జనం వింతగా చెప్పుకుంటున్నారు" అన్నాడు శాస్త్రులుగారు.

"నిజంగా! శాస్త్రులుగారూ! మీరెలాగయినా ఆ స్వాములవారు మా ఇంట్లోనే బసచేసేలా చూడండి. ఫలానా కౌసల్యగారింట్లో స్వాములవారు దిగారట' అని "జనం తండోపతండాలుగా, తీర్థప్రజల్లా మా ఇంటికి వస్తూపోతూ ఉంటే ఎంతగొప్పగా ఉంటుంది. అయినా ఈ ఊళ్ళోమడీ, ఆచారం, పూజ పునస్కారాలున్న ఇల్లు మాది తప్ప ఇంకొకటి ఉంటే చూపించండి" అంది కౌసల్య గర్వంగా తల ఎగరవేస్తూ.

"సత్యం చెప్పావమ్మా!" అని మెచ్చుకుంటూ ఖండువా భుజానవేసుకుని "స్వామివారు మా ఇంట్లోనే దిగే ఏర్పాటు చేస్తాను. వస్తానమ్మా!" అని వెళ్ళిపోయారు శాస్త్రులుగారు.

* * *

ఆఫీసునుండి ఇంటికి వస్తూ... కూరలు, పండ్లు కొనుక్కుని ఇంటికి, వచ్చింది సంధ్య.

గేటు తీస్తూ అప్రయత్నంగా ఎదురింటి వైపు చూసింది. అక్కడ ఇంటిముందు చాలామంది జనం గుమిగూడి కనిపించారు. ఇంకా వచ్చేవాళ్ళు వస్తున్నారు. వెళ్ళేవాళ్ళు వెళ్తున్నారు. ఒక్కసారిగా సంధ్య గుండె వేగంగా కొట్టుకుంది. 'ఆ ఇంట్లో ఏమయింది?' అన్న ఆలోచన రాగానే చేతిలో బుట్టతోసహా పరుగులాంటి నడకతో ఎదురింటికి వెళ్ళింది.

గుమ్మంలోనుండి లోపలికి తొంగిచూసింది. నారపీచు లాంటి తెల్లటి మూరెడు గడ్డం, జనపాల జుట్టు నుదుటిన విభూతిరేఖలతో ఒక సాధువు కూర్చొని ఉన్నాడు. అతనికి ఒక చేతిలో కమండలం, మరోచేతిలో జపమాల ఉన్నాయి.

ఎదురుగా కౌసల్య సాష్టాంగపడి ఆ సాధువు పాదాలకు నమస్కారం చేస్తున్నది. ఆమె ప్రక్కన ముకుందంగారు కొత్తగా స్కూల్లో చేరిన కుర్రాడు టీచరు చేతిలోని బెత్తానికి భయపడి బుద్ధిగా క్లాసులో కూర్చున్నట్టుగా కూర్చుని ఉన్నారు.

"అమ్మా! కౌసల్యా! నువ్వు నిజంగా పుణ్యాత్మురాలి వమ్మా సాక్షాత్తూ ఆ పార్వతే నీ రూపంలో ఇలా జన్మించింది. పాతివ్రత్యంలో ఆ సావిత్రినే మరిపిస్తున్నావని..నీ ముఖం చూస్తేనే తెలిసిపోతున్నది. ఇంతటి లక్ష్మీకళ నేను ఏ స్త్రీలోనూ చూడలేదమ్మా..!" అని కౌసల్యను పొగడ్తలతో ముంచేస్తున్నాడు ఆ సాధువు.

కౌసల్య పారవశ్యంతో ఆ మాటలు వింటూ, తన చుట్టూ ఉన్నవారు కూడా వింటున్నారా, లేదా అని ఓ కంట గమనిస్తున్నది. ఆ వాతావరణాన్ని ఆ జనసందోహాన్ని చూసిన సంధ్య గిరుక్కున వెనక్కు తిరిగింది.

సంధ్యలాంటి నాస్తికురాలు సైతం స్వామిదర్శనంకోసం తన ఇంటికిరావడం ఆమెకు గర్వంగా ఉంది.

"సంధ్యా!" అని పిలిచింది.

వెనక్కు తిరిగింది సంధ్య.

"స్వామిదర్శనం కోసం వచ్చావా? లోపలికి రా!" అంది.

"లేదు! మీ ఇంట్లో జనం మూగి ఉంటే ఏం జరిగిందో అని భయపడి వచ్చాను. వస్తాను!" అంటూ పోబోయిన సంధ్యను భుజం పట్టుకుని ఆపింది కౌసల్య.

"వచ్చినదానివి వచ్చావు. స్వామిదర్శనం చేసుకుని..ఆయన పాదాలకు నమస్కరించి వెళ్ళు".

"ఆయన మనలాంటి మామూలు మనిషని చూస్తేనే తెలుస్తున్నది. ఆయన పాదాలకు నేనెందుకు నమస్కరించాలి?" అంది సంధ్య.

"అపచారం! ఆయన మామూలు మనిషికాదు! ఆయన దగ్గర చాలా శక్తులున్నాయి".

"అవి శక్తులు కావు! మాజిక్‌లు. అవి ఏ మెజీషియన్ అయినా చేసి చూపించగలడు. అమాయక ప్రజలను మోసంచేసే ఇటువంటి దొంగ సన్యాసులంటే నా కసహ్యం" తీక్షణంగా చూస్తూ అంది సంధ్య.

"పైకి అలా అంటావుగాని! నీకూ దేవుడిమీద భక్తి బాగానేవుంది. రేపు శనివారమనా కొబ్బరికాయ పట్టుకెళ్తున్నావ్!" వ్యంగ్యంగా అంది కౌసల్య, సంధ్య చేతిలోని బుట్టవంక చూస్తూ.

"మా వారికి కొబ్బరి పచ్చడి అంటే చాలా ఇష్టం! రేపుచేద్దామని పట్టుకెళ్తున్నాను. వస్తానండీ!" అంటూ చకచకా తన ఇంటివైపు వెళ్ళింది సంధ్య.

"ఎంత పొగరు! ఏం చూసుకునో మనిషికి అంత విరగబాటు!" అని కసిగా గొణుక్కుంది కౌసల్య

"ఊరంతా తనను ఓ మహాపతివ్రతగా, భక్తురాలుగా కొలుస్తూంటే 'ఈ సంధ్య మాత్రం కంట్లో నలుసులా తయారయింది..' అనుకుంది.

ఆ ఇద్దరి సంభాషణ విన్న ముకుందంగారు వెళ్తున్న సంధ్య వంక అపురూపంగా చూస్తూ 'తెలివిగలపిల్ల' అని మనసులోనే మెచ్చుకున్నారు.

* * *

ఆరోజు సత్యనారాయణవ్రతం తలపెట్టింది కౌసల్య. ప్రతిరోజూ భార్య ఏ నోమో, వ్రతమో తలపెట్టి, తన పాతివ్రత్య ధర్మానికి గుర్తుగా పక్కన తనని కూర్చోమనటం, మధ్యాహ్నం రెండు గంటలవుతున్నా కూడు పెట్టకుండా మాడ్చి చంపటం ముకుందంగార్కి చెడ్డ చిరాకుగా ఉంటున్నది.

అయినా ఏమీ అనలేడు.

నోరెత్తితే చాలు తన్నే అమాయకుడిగా, అసమర్థుడిగా జమకట్టి తన తెలివితేటల్ని తనే పొగుడుకుంటూ ఓ గంటో, రెండు గంటలో ఏకధాటిగా ఉపన్యాసం దంచుతుంది. ఆ సమయంలో ముకుందంగార్కి సుత్తితో ఎవరో నెత్తిన బాదుతున్నట్లుగా ఉంటుంది.

కౌసల్య దృష్టిలో పూజావిధానం, మడి, ఆచారనియమాలు తెలియనివాళ్ళు మనుష్యులక్రిందకి జమకారు. ప్రపంచంలోని విజ్ఞానమంతా అందులోనే దాగున్నట్లు ఆమె అభిప్రాయపడుతుంది.

అందుకే ముకుందంగారు ఏమీ మాట్లాడరు. శాస్త్రోక్తంగా పూజ ముగిసింది. ముకుందంగార్కి నడుము, కాళ్ళు లాక్కొచ్చాయి కూర్చుని, కూర్చుని.

ఇక తరువాతి అంశం...బ్రాహ్మడికి అపోసన వేసుకోవడం.

వడ్డించిన విస్తరిలో రకరకాల పిండివంటలు ఘుమఘుమ వాసనలతో నోరూరిస్తున్నాయి.

ముకుందంగారి కడుపులో ఎలకలు తొలపటం మొదలుపెట్టాయి. ఆయన అసలే ఆకలికి తట్టుకోలేరు. పీటమీద బాసింపట్టు వేసుకుని కూర్చున్న శాస్త్రిగారు అపోసన పట్టడం ఆలస్యం అవురావురుమంటూ విస్తరికి ఎగబడ్డారు.

ఎదురుగా కూర్చున్న ముకుందంగార్కి నోట్లో ఎడతెరిపి

లేకుండా లాలాజలం ఊరిపోతున్నది.

శాస్త్రిగారు తలవంచుకుని తన పని తను కానియ్యకుండా 'రన్నింగ్ కామెంట్రీ' కూడా మొదలు పెట్టారు.

"అబ్బ! పాయసం అమృతంలా ఉందమ్మా!"

"నీ.. నా బొంద! పాయసం తియ్యగా ఉండక చేదుగా ఉంటుందా! వెధవ పొగడ్తలు తొందరగా తినక." మనసులోనే విసుక్కున్నారు ముకుందంగారు.

"ఇంకొంచెం వడ్డించమంటారా?" అంటూ గిన్నె పట్టుకుని తయారయింది కౌసల్య.

"నెమ్మదిగా కూర్చోండి శాస్త్రులుగారూ! తొందరపడకండి!" అంటున్న భార్యను చూస్తే వళ్ళు మండిపోయింది ముకుందంగార్కి.

"అలాగేనమ్మా! సావధానంగానే తింటాను" అన్నారు శాస్త్రులుగారు.

కోపం తారాస్థాయినందుకుంది ముకుందంగార్కి.

"దోసకాయ ఆవపెట్టి చేసినట్లున్నావు బ్రహ్మాండంగా ఉంది"

"నా శార్ధం పెట్టి చేసింది! ఆడంగి రేకుల కబుర్లు...అన్నీ తింటూ మాటలెందుకో మధ్య..అదో ఆలస్యం".

శాస్త్రులుగారు మజ్జిగన్నంలోకి రాగానే ముకుందంగారి మనను కాస్త శాంతించింది.

"అమ్మయ్య! దగ్గరలో పడింది!" అనుకున్నారు సంతోషంగా.

భార్య లటలటా మీగడ పెరుగు శాస్త్రులుగారి విస్తట్లో గుమ్మరిస్తుంటే గుటకలు మింగారు ముకుందంగారు.

'బ్రేవ్' మని తేన్చుకుంటూ అడుగెత్తున లేచిన బొజ్జను భుక్తాయాసంతో తడుముకుంటూ పీటమీద నుంచి లేచారు శాస్త్రులుగారు.

ఆయనకు దక్షిణతాంబూలం ఇచ్చి పంపించి పీట మీద తను కూర్చున్నారు ముకుందంగారు.

భార్య కౌసల్య వడ్డించింది.

నిజంగా పాయసం రుచిగా ఉంది.

ఇంకొంచెం తినాలనిపించింది.

కానీ అప్పటికే గిన్నె తుడిచేసింది కౌసల్య

"దేవుడి నైవేద్యం, బ్రాహ్మడి భోజనం వరకు వస్తే చాలని కొంచెమే చేశాను" అంది.

నైవేద్యం విస్తరి 'ఆమెకే రిజర్వ్‌డ్' అని తెలును ముకుందంగార్కి.

బ్రాహ్మడు తనకు సరిపడినంత తినగా, మిగిలింది తనకు వేసింది.

గడ్డపెరుగుకోసం ఎదురుచూస్తున్న ముకుందంగార్కి ఓ గరిటెడు పెరుగు విదిల్చి, రెండు గరిటెలు మజ్జిగ నీళ్ళు పోసింది కౌసల్య.

ఎలోగోలా ఆకలి తీరగానే పోయిన ప్రాణం లేచివచ్చినట్లుగా అనిపించింది ఆయనకు.

ఆ సాయంత్రం ప్రసాదం పట్టుకుని సంధ్య వాళ్ళ ఇంటికి వెళ్ళింది కౌసల్య.

"రండి! కూర్చోండి!" అని చాలా మర్యాద చేసింది సంధ్య.

"ఈరోజు మేము సత్యనారాయణవ్రతం చేసుకున్నాము. ప్రసాదం తీసుకో!" అంటూ చేతిలో పెట్టింది కౌసల్య.

"అలాగా!" అంటూ చటుక్కున నోట్లో వేసుకుని "ప్రసాదం చాలా రుచిగా ఉందండీ!" అంది సంధ్య మెచ్చుకోలుగా.

కళ్ళకద్దుకోకుండా ప్రసాదం నోట్లో వేసుకున్న సంధ్యను చూసి 'ఏం మనిషో!' అనుకుంది కౌసల్య నిరసనగా.

వంటగదిలోకి తొంగి చూస్తూ "మీకు పూజా అదీ ఏమీ లేదా? దేవుడ్ని ఎక్కడ పెట్టారు!" అంది.

"దేవుడ్ని ఒకచోట మనం పెట్టేదేమిటండీ! ఆయన సర్వాంతర్యామి కదా! ఎప్పుడు తలచుకుంటే అప్పుడే మన మనసులో నిలుస్తాడు."

"నీకు మడీ, ఆచారం మీ అమ్మ నేర్పలేదా?"

"మడీ, ఆచారం అంటే శుచీ, శుభ్రతేకదా! అది చిన్నప్పటినుండీ నాకలవాటే."

ప్రతిదానికీ అలా పెడసరం సమాధానాలు ఇస్తున్న సంధ్యను ఉక్రోషంగా చూసింది కౌసల్య.

"ఇంతకూ దేవుడు లేడంటావా?"

"ఎందుకు లేడు? తప్పకుండా ఉన్నాడు."

"అమ్మయ్య ఒప్పుకున్నావుకదా! మీ ఆరాధ్యదైవం ఎవరో చెప్పు."

"సృష్టిదేవత"

'ఈ కొత్త దేవత ఎవరు? నేనెప్పుడూ ఆపేరు వినలేదే అని క్షణం అయోమయంలో పడింది కౌసల్య.

వచ్చే సంచిక నుండే
కదంబమాల
కొత్త ఆకర్షణలతో....

"మనదేశంలో చాలామంది దేవుళ్లే వున్నారు. వీరు కాక ఈ అమ్మలు... అయ్యలు.. కానీ నా దృష్టిలో మాత్రం దేవుడొక్కడే. ఆ దేవుడికి మీరేపేరయినా పెట్టుకోండి. అది మానవాతీతమయిన ఒక మహత్తరమయిన శక్తి. అందమైన, అద్భుతమైన ఈ సృష్టికి — జీవుని జనన మరణాలకు కారణమైన ఆ దేవత ఎవరో — ఆ అదృశ్యశక్తి ఏమిటో దాన్నే నేను ప్రతిరోజూ ఓ ఐదు నిముషాలు నిశ్చల భక్తితో ప్రార్థిస్తాను. పదిపైసలు దేవుడి హుండీలో కానుకగా వేయటంకన్నా ఆ పదిపైసలు శక్తిహీనుడయిన ఓ బిచ్చగాడి బొచ్చెలో వేస్తే పుణ్యం వస్తుందని నమ్మేదాన్ని నేను.

"గుళ్ళో ప్రాణంలేని ఆ రాతిబొమ్మ మీదకన్నా — ఎదుటి మనిషికి సాయపడే మంచిమనిషి మనసుమీద నమ్మకం ఉంది నాకు.

"నిజానికి విగ్రహారాధన వల్ల వచ్చే ప్రమాదమేమీ లేదు. గుడికి పట్టుకెళ్ళి కొబ్బరికాయను మళ్ళీ భద్రంగా ఇంటికి తెచ్చుకుని పచ్చడి చేసుకుంటారు. ఆ పూట కూర ఖర్చు దేవుడిపేరు మీద వెళ్ళిపోతుంది. మనం ఎలా చేసినా ఏం పెట్టినా నోరులేని దేవుడు ఏమీ మాట్లాడడు. అందుకే విగ్రహారాధనకన్నా మానవారాధన ప్రమాదకరమయింది అంటాను. తనకుతానే ఓ గొప్పతనాన్ని అంటగట్టుకుని ప్రజల బలహీనతలను, మూఢభక్తిని తన స్వార్థంకోసం వాడుకునే వ్యక్తులంటే నాకు పట్టరాని కోపం వస్తుంది. ఆత్మన్యూనతా భావంతో వ్యక్తిత్వాన్ని చంపుకుని — ఓ మోసగాడి కాళ్ళు పట్టుకునే భక్తులన్నా నాకు గిట్టదు" అంది సంధ్య ఆవేశంగా.

భుజాలు తడుముకున్న కౌసల్య రోషంతో చటుక్కున లేచింది. ఆప్యాయంగా ఆమె భుజాలు పట్టుకుని కూర్చోబెట్టింది సంధ్య.

"క్షమించండి! మిమ్మల్ని దృష్టిలో పెట్టుకుని ఎగతాళి చేయాలనే ఉద్దేశంతో నేనలా మాట్లాడలేదు. చిన్నప్పటినుండి ఒక పరిధిలో, ఒకే పద్ధతిలో పెరిగిన మీ పరిస్థితిని నేనర్థం చేసుకోగలను. కానీ పెద్ద చదువులు చదివి, ఉన్నత పదవుల్లో ఉన్న వాళ్ళు సైతం ఈ మాయల్లో పడిపోవటం నాకు ఆశ్చర్యాన్ని బాధను కలిగిస్తుంది."

అవనతవదనయై ఏదో ఆలోచిస్తున్న కౌసల్యను చూస్తుంటే బాధ అనిపించింది సంధ్యకు.

"కౌసల్యగారూ! ఏ విషయాన్నయినా తరచి చూడటం, నిశితంగా ఆలోచించటం, నిర్మొహమాటంగా విమర్శించడం నాకు చిన్నతనంనుండీ అలవాటయింది. వ్యక్తిగతంగా ఎవరినీ బాధించాలనిగాని, అవమానించాలనిగాని నా ఉద్దేశం కాదు. నా మాటలు మిమ్మల్ని బాధిస్తే క్షమించండి" అంది కౌసల్యను సమాధానపరుస్తూ.

సంధ్య మాటతీరు, మన్నన, ప్రతి విషయాన్ని శాస్త్ర దృష్టితో తర్కించే ఆమె ఆలోచనాశక్తి కౌసల్యను ఆశ్చర్యచకితురాల్ని చేసాయి.

ఇంతకుముందు సంధ్యపట్ల తనలో దాగున్న నిరసన భావం, నిర్లక్ష్యం ఎవరో చేతితో తీసేసినట్లుగా పూర్తిగా తొలగిపోయాయి.

అహంభావం తొలగిపోవటంతో ఇప్పుడు ఆమె మనను స్ఫటికంలా స్వచ్ఛంగా తయారయింది. కల్మషం లేని మనసుతో ఆత్మవిమర్శ చేసుకున్న తరువాత తనేమిటో తనకు తెలిసివచ్చింది.

పూజాపునస్కారాలకోసం వందలు, వేలు ఖర్చుపెట్టగలిగిన తను దీనస్థితిలో చేయిచాచి అడిగిన 'రంగమ్మ'కు అసలును మించిన వడ్డీ గుంజి ఆమె అవసరాన్ని తన వ్యాపారంగా మలుచుకుంది. బ్రాహ్మడికి కడుపునిండా అన్నం పెడితే 'పుణ్యం' అనుకుందికానీ, మాడుతున్న భర్త డొక్కలను గమనించలేకపోయింది.

కళ్ళు మూసుకుని గంటల తరబడి మంత్రాలు చదివితేనే పుణ్యం వస్తుందన్న భ్రమలో - అజ్ఞానంలో, మానవత్వపు విలువలను మరచిపోయింది.

దేవుడికి వైభవంగా పూజలు జరిపించడంకోసం, జీవితభాగస్వామి అయిన భర్తను మోసంచేసి ఆయన కష్టార్జితాన్ని తన స్వార్థం కోసం ఖర్చుపెట్టింది. స్వంత సంపాదన అని తను గర్వంగా ఆర్జించినదంతా ఇతరులను పీడించి, మోసంచేసి, సంపాదించినదే.

అహంకారంతో, మలిన హృదయంతో చేసే పూజలను ఆ భగవంతుడు సైతం స్వీకరించడు. పరోపకారబుద్ధి, నిష్కల్మష హృదయం ఉన్నవాళ్ళు చేసే ఒక్క నమస్కారం చాలు ఆ దేవుడికి. 'మానవసేవే మాధవ సేవ' అన్న సత్యాన్ని ఎన్ని పురాణాలు, గ్రంథాలు చదివినా అర్థం చేసుకోలేకపోయింది. పశ్చాత్తాప భారంతో అలసిపోయిన కౌసల్య మనసుకు ఎప్పటికో విశ్రాంతి లభించింది.

ఉదయాన్నే పక్కమీద కళ్ళు విప్పిన కౌసల్యకు ఈ జగత్తంతా కొత్తగా కనిపించింది. అది ఆమె కొత్త జీవితానికి సుప్రభాతం. అప్పుడే వికసించిన కుసుమంలా స్వచ్ఛంగా ఉన్న ఆమె మనసులోని కొత్త ఊహలకు అది సుప్రభాతం.